క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



మర్రిపాడు: మండల నూతన ఎస్సై శ్రీనివాస రావు, ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్‌ను ఆత్మకూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని శాలువాలతో సత్కరించి ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలను అందజేశారు. ఆయన వెంట బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మురళి, తదితరులు ఉన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేశ్వరరావు

కావలి: విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని కావలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీ రాజేశ్వరరావు సూచించారు. రుద్రకోటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. వాహన, డ్రైవింగ్ లైసెన్సులు విధిగా కలిగి ఉండాలన్నారు.

ఉదయగిరి: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. ఉదయగిరిలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ వినియోగంపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి బయట పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. హెల్మెట్ లేకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

సంగం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులు సహకరించాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి ఆయన ఎస్సై రాజేష్‌తో కలిసి సంగం బస్టాండ్ సెంటర్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు.

సర్వీసును క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి



చేజర్ల: జీఓ నంబర్ 114 ప్రకారం తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పసుపు రిబ్బన్లు ధరించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు మల్లేశ్వరరావు, సంధానీ బాషా, శ్రీధర్, సురేష్, యల్లయ్య ప్రసాద్, సుబ్బారావు, కామాక్షమ్మ, నాగమల్లేశ్వరమ్మ, సాలమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన సయ్యద్ అబ్దుల్‌మునాఫ్, 23వ వార్డుకు చెందిన మాచవరం పద్మావతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు చెక్కులను అందజేశారు. ఆయన వెంట రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



ఆత్మకూరు: పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఏఎస్సార్ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు మూడేళ్లుగా యూనివర్సిటీ స్థాయిలో మంచి ర్యాంకులు సాధిస్తూ మంచిపేరు తెస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల ఏటా కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ ఏడాది జిల్లాలోనే అత్యధికంగా విద్యార్థులు కలిగిన కళాశాలగా గుర్తింపు పొందిందన్నారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులు సైతం ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ప్రిన్సిపల్ ఏ శ్రీనివాసులురెడ్డి, ప్రెసిడెంట్ ఎం సురేంద్ర, డైరెక్టర్ డీ ప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు

- మూడు నెలలు పూర్తైనా కార్యాచరణ ప్రకటించని కూటమి ప్రభుత్వం
- తెరుచుకోని వెబ్‌సైట్
- సచివాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు



ఏఎస్‌పేట మండలంలో పింఛన్ల పంపిణీ(ఫైల్)

అనుమసముద్రంపేట/అల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా కొత్త పింఛన్ల పంపిణీపై ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణను రూపొందించలేదు. దీంతో కొత్తగా అర్హత సాధించిన ఎంతో మంది కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తులు పట్టుకుని రోజూ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది చెప్పే సమాధానం విని నిరాశగా వెనుదిరుగుతున్నారు.

గత ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు

గత ప్రభుత్వ హయాంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్లు చొరవ చూపి మంజూరయ్యేలా చూసేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. ఇప్పుడా ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల దరఖాస్తు వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది.

అర్హుల నిరీక్షణ

ఆత్మకూరు నియోజకవర్గంలో 93 సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 37,631 మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. అల్లూరు మండలంలోని 13 సచివాలయాల పరిధిలో 7452 మంది పింఛన్లు పొందుతున్నారు. గత ప్రభుత్వం చివరి దశలో కొందరు పింఛన్లకు దరఖాస్తు చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పింఛన్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. గత ఏప్రిల్‌లో నిలిచిపోయిన వెబ్‌సైట్ ఇప్పటి వరకు తెరుచుకోలేదు. గత ఆరు నెలల కాలంలో దివ్యాంగ, వితంతు, వృద్ధాప్య పింఛన్ల కోసం కొత్తగా పదుల సంఖ్యలో అర్హత సాధించారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు అందజేయనున్నట్లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు కొత్త పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో కొత్తగా అర్హత సాధించిన వారితో పాటు గత ప్రభుత్వంలో చివరి దశలో దరఖాస్తు చేసుకున్న వారు సైతం ఎప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. మండల తహసీల్దార్ కార్యాలయాలతో పాటు ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు అందజేస్తున్నారు. స్థానిక సచివాలయాల చుట్టూ దరఖాస్తులు పట్టుకుని తిరుగుతున్నారు. ఇలా వెళ్లిన వారికి అధికారులు ప్రభుత్వం ఇప్పటి వరకు వెబ్‌సైట్ తెరవలేదన్న సమాధానం చెబుతుండడంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు.

ఆర్భాటంగా ప్రచారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఒక్క పింఛన్‌ను మంజూరు చేయలేదు. అయినప్పటికీ గతంలో ఇస్తున్న పింఛన్లను ప్రజాప్రతినిధులు, నాయకులతో పంపిణీ చేయిస్తూ ఆర్భాటం చేస్తోంది. గతంలో ఇస్తున్న పింఛన్‌ను రూ.3 వేలకు ఒక వెయ్యి పెంచి అందజేస్తున్నారు. పెంచిన పింఛన్‌ను ఆ నెలలో మాత్రమే ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తారు. ఆ తరువాత యథావిధిగా అధికార యంత్రాంగం ద్వారా పంపిణీ చేస్తారు. కానీ ఇప్పుడు అలా కాకుండా ప్రచారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన అప్పట్నుంచి ప్రతి నెలా ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పంపిణీ చేస్తూ ఆర్భాటం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయకుండానే ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడవగానే 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకోవడం అందర్నీ విస్మయానికి గురిచేసింది.

పింఛన్లు ఇవ్వాలి



పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయకపోవడంతో అర్హులైన వారు ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరుకు చర్యలు తీసుకోవాలి.

– ఎల్లు సాల్మన్‌రాజు, రాష్ట్రాధ్యక్షుడు, అంబేడ్కర్ యువజన సంఘం, అల్లూరు

ప్రభుత్వ నుంచి ఆదేశాలు రాలేదు

పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు ఇంకా రాలేదు. త్వరలో ఆదేశాలు రావచ్చు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

–రజనికాంత్, ఎంపీడీఓ , అల్లూరు

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యాన అధికారి రాజశేఖర్



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీ లక్ష్మీమాధురి

ఉదయగిరి: పంటల సాగులో తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని, ఆ దిశగా రైతులను గ్రామ వ్యవసాయ సహాయకులు చైతన్యవంతం చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధురి అన్నారు. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం నిర్వహించారు. పంటల సాగు, విత్తశుద్ధి, సస్యరక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నెల్లూరు కేవీకే శాస్త్రవేత్త విజయ్‌కుమార్‌నాయక్, ఏడీఏ చెనారెడ్డి, వ్యవసాయశాఖాధికారులు వెంకటసుబ్బారెడ్డి, చక్రవర్తి, రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందులను పరిమితంగా వాడాలి

సోమశిల రేవూరు, మినగల్లు గ్రామాల్లో ఏఓ పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు ఆత్మ పీడీ శివన్నారాయణ, ఆత్మకూరు ఏడీఏ దేవసేన పాల్గొని రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ మాట్లాడుతూ పురుగు మందులను విచక్షణ రహితంగా వాడడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతిని భవిష్యత్తులో తెగుళ్ల ఉధృతి పెరుగుతుందన్నారు. ఏడీఏ మాట్లాడుతూ వరి సాగు చేసే రైతులు ప్రతి రెండు సీజన్లకు ఒకసారి 20 కిలోల జింకును దుక్కిలో వాడాలన్నారు. ఏఓ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌కు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివజ్యోతి మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువగా వాడరాదని సూచించారు

మిరప, బొప్పాయి పంటల పరిశీలన

అనంతసాగరం, గొరవరం గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న మిరప, బొప్పాయి పంటలను ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ రాజశేఖర్ పరిశీలించారు. వర్షాలకు మిరప, బొప్పాయి చెట్లు ఉరకెత్తకుండా లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. మొక్కలు తలలు వాల్చితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను పిచికారి చేయాలని సూచించారు. పైపాటుగా ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలని తెలిపారు. వేరుకుల్లు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు రోడోమిల్ గోల్డ్ లేదా 2 గ్రాములు సాఫ్ లేదా 3 గ్రాముల బ్లిటాక్స్ లీటర్ నీటికి కలిపి చెట్ల మొదళ్ల మీద పిచికారీ చేయాలని సూచించారు.

వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఉదయగిరి: రాష్ట్ర బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వెలుగొండ ప్రాజెక్ట్ సాధన సమితి నాయకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. స్థానిక కోట్నీస్ వైద్యశాలలో వెలుగొండ సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా సాధన సమితి, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తయితే వెనుకబడిన నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాలకు సాగు,తాగునీటి సమస్య తీరుతుందన్నారు. పార్టీలకు అతీతంగా వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కోసం ఉద్యమించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరి, అహ్మద్, రామిరెడ్డి, రైతు సంఘం నాయకుడు వెంకటయ్య, ఫస్ట్ డైరెక్టర్ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



కావలి: జాతీయరహదారిపై డ్రమ్ములు, టైర్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు



దుత్తలూరు: బ్లాక్‌స్పాట్‌లో డ్రమ్ములు ఏర్పాటు చేసిన పోలీసులు

కావలి: జిల్లా ఎస్పీ, కావలి డీఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని రూరల్ స్టేషన్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన రూరల్ ఎస్సైలు సీహెచ్ తిరుమలరెడ్డి, ఎం బాజీబాబుతో కలిసి జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించారు. వాహనాల వేగ నిరోధానికి రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములు, టైర్లు ఏర్పాటు చేశారు.

దుత్తలూరు: మండల పరిధిలోని 565వ నంబర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి వాహనాల వేగనిరోధానికి రేడియం స్టిక్కర్లతో కూడిన డ్రమ్ములను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై పీ ఆదిలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె పోలీసులతో కలిసి పిల్లాపేరు వాగు సమీపంలో డ్రమ్ములు ఏర్పాటు చేసి ట్రయల్‌రన్ నిర్వహించారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ



సీతారామపురం: స్థానిక భవిత కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు డిస్లెక్సియాపై అవగాహనా ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్‌వలి మాట్లాడుతూ అభ్యసనా వైకల్యం కలిగిన పిల్లలు చదవడం, రాయడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకుని సమస్యలను అధిగమించేలా ప్రోత్సహించాలన్నారు. సీతారామపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఐఈఆర్‌టీ విజయ్, ఐఈడీఎస్ఎస్ అన్వర్‌బాషా, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

విశ్రాంత ఎస్సై మృతి



సుబ్బరామయ్య (ఫైల్)


కావలి: పట్టణానికి చెందిన విశ్రాంత ఎస్సై బొడ్డు సుబ్బరామయ్య (70) అనారోగ్యంతో ఆస్పత్రి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పట్టణంలోని బుడంగుంట రైల్వేగేటు సమీపంలోని స్వగృహంలో ఉంచిన ఆయన భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు.

4న మాలల మహాగర్జన



అల్లూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వచ్చే నెల 4న అల్లూరులో మాలల మహాగర్జన కార్యక్రమం చేపట్టనున్నట్లు అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజ్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో అంబేడ్కర్ యువజన సంఘ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సోదరులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు అరగల రమణయ్య, పొంగులూరు శ్రీనివాసులు, దానం మాల్యాద్రి, పొంగులూరు సుధాకర్, ముసలి నరేంద్ర, కమలాకర్, చెన్నయ్య, మనోహర్, సతీష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



సీతారామపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని ఎంఈఓ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక కోటవీధిలోని స్పెషల్ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల మార్కులు, హాజరు నమోదు, డ్రాపౌట్స్‌పై ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

జస్టిస్ లక్ష్మణరావు గొప్ప మానవతావాది



లక్ష్మణరావుకు నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి: రెడ్‌క్రాస్ ఉమ్మడి రాష్ట్రాధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన జస్టిస్ అంబటి లక్ష్మణరావు గొప్ప మానవతావాది, సంస్కరణాభిలాషి అని రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ డీ రవిప్రకాష్ కొనియాడారు. జస్టిస్ అంబటి లక్ష్మణరావు అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూసారు. ఈ నేపథ్యంలో కావలి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో లక్ష్మణరావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ అంబటి లక్ష్మణరావు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం రెడ్‌క్రాస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. కావలి రెడ్‌క్రాస్‌కు ఎంతో సహకారాన్ని అందించారని స్మరించుకున్నారు. ఎన్నికల నిఘా వేదికను స్థాపించి, పారదర్శక ఎన్నికల నిర్వహణకు కృషి చేశారని కొనియాడారు. జాతీయ రహదారుల పక్కన మద్యం అమ్మకాల నిషేధం కోసం ఎంతో పోరాడారని తెలిపారు. రెడ్‌క్రాస్ బాధ్యులు హరినారపరెడ్డి, బీఎస్ ప్రసాదం, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

12వ వార్డుకు ఉపఎన్నిక ఎప్పుడో?

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి అనారోగ్యంతో గతేడాది సెప్టెంబరులో మృతి చెందారు. స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధి మృతి చెందినా, రాజీనామా చేసిన ఆరు నెలల వ్యవధిలో ఉపఎన్నికలు నిర్వహించాలి. అయితే కౌన్సిలర్ మృతి చెంది 14 నెలలు గడిచినా ఉపఎన్నిక నిర్వహించకపోవడం ఏమిటని 12వ వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కౌన్సిలర్ మృతి చెందినప్పటి నుంచి ఇప్పటి వరకు తొమ్మిది సార్లు కౌన్సిల్ సమావేశాలు జరిగాయి, తమ వార్డుకు కౌన్సిలర్ లేని కారణంగా సమస్యలను విన్నవించేందుకు అవకాశం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. 2021లో మున్సిపల్ ఎన్నికలు జరిగిన సమయంలో 12 వార్డు పరిధిలో 1088 మంది ఓటర్లు ఉన్నారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి కొండా యుగలక్ష్మి, టీడీపీ నుంచి నాగభూషణమ్మ, జనసేన నుంచి మొద్దు ప్రసన్న, కాంగ్రెస్ నుంచి వనుపాల సుబ్బమ్మ పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన యుగలక్ష్మి 30 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. ఆమె తన వార్డు పరిధిలోని అనేక సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం 12వ వార్డుకు ఉపఎన్నిక నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై కౌన్సిలర్ గంగా ప్రసాద్‌ను సంప్రదించగా తాను కొత్తగా వచ్చానని, కలెక్టర్, మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అదనపు రేషన్ దుకాణాల ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న డీటీ అజీజుల్లాఖాన్

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు 800కుపైగా కార్డులు కలిగిన రేషన్ దుకాణాల పరిధిలో కొత్తగా అదనపు దుకాణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆత్మకూరు పౌర సరఫరాల శాఖ డీటీ అజీజుల్లాఖాన్ తెలిపారు. మండలంలోని కరటంపాడులో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఆత్మకూరు పౌర సరఫరాల శాఖ పరిధిలో ఏఎస్‌పేట మండలం ఏఎస్‌పేట టౌన్, అనుమసముద్రంపేట, ఆత్మకూరు మండలం కరటంపాడు, బోయలచిరివెళ్ల పంచాయతీల పరిధిలో 800కుపైగా కార్డులు ఉండడంతో అదనపు రేషన్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బోయలచిరివెళ్ల రేషన్ దుకాణం పరిధిలోని నబ్బీనగరం, పమిడిపాడు గ్రామాలకు కొత్తగా రేషన్ దుకాణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్థానిక సర్పంచ్ పూనుగుంట రేవతి, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, వీఆర్వో చల్లా చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా గృహాలను పూర్తి చేయాలి

సీతారామపురం: పక్కాగృహ నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఆత్మకూరు డివిజన్ హౌసింగ్ ఈఈ దయాకర్ సూచించారు. మండలంలోని బసినేని పల్లి, సంజీవరెడ్డినగర్, సీతారామపురం, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ పక్కాగృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేశారు. ఆర్‌సీ లెవెల్‌లో ఉన్న గృహాలను డిసెంబరు 31లోగా పూర్తిచేయాలన్నారు. బీఎల్, ఎల్ఎల్ దశలో ఉన్న వాటిని వచ్చే ఏడాది మార్చి 25లోగా పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం సీతారామపురం బిట్–1 సచివాలయంలో పక్కాగృహాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. హౌసింగ్ ఏఈ రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఉదయగిరి: ప్రభుత్వ లేఅవుట్లలో ఆప్షన్- 12 కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ దయాకర్ తెలిపారు. మండలంలోని శకునాలపల్లి, పుల్లాయలపల్లి గ్రామాల్లో పక్కాగృహ నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ శాఖ సిబ్బందితో సమీక్షించారు. ఉపాధికి సంబంధించిన 90 రోజుల పనిదినాల నగదు గృహ లబ్ధిదారులకు త్వరితగతిన అందేలా చూడాలన్నారు. ఎంపీడీఓ అప్పాజీ, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఏపీఎం ఖాజారహంతుల్లా, ఏపీఓ శ్రీనివాసులు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ షరీఫ్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

సోమశిల: వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. అనంతసాగరం మండలం రేవూరులో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

ఆత్మకూరురూరల్: నువ్వూరుపాడు ఎస్టీకాలనీలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ కరపత్రాలు పంచి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్‌డీ డేవిడ్, పీఎస్ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

కలిగిరి: జిర్రావారిపాళెంలో పంచాయతీ కార్యదర్శులు రవిచంద్ర, అశోక్ పర్యవేక్షణలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. వాటర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేపట్టడంతో మరమ్మత్తులకు గురైన మంచినీటి పథకం మోటార్‌ను బాగుచేయించారు.

నేటి నుంచి సబ్సిడీపై విత్తనాల పంపిణీ

కలిగిరి: మండలంలోని రైతులకు శనివారం నుంచి 25 శాతం రాయితీపై వరి, పచ్చిశనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఏఓ ఎం సురేష్ శుక్రవారం తెలిపారు. కేఎన్ఎం–16380 రకం వరి విత్తనాలు 350 క్వింటాలు, పచ్చిశనగ జేజీ–11 రకం 300 క్వింటాలు, కేఏకే2 రకం 400 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జెరాక్స్‌లతో రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

సంగం: మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ శ్రీహరి శుక్రవారం తెలిపారు. సబ్సిడీపై బీపీటీ–5204 రకం విత్తనాలను 25 కిలోల బస్తా రూ.920, కేఎన్ఎం–1638 రకం 30 కేజీల బస్తా రూ.1065కే అందజేస్తున్నట్లు చెప్పారు. ఆర్ఎన్ఆర్–15048 రకం విత్తనాలను మూడో వారంలో అందజేస్తామని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాలను వీఏఏలను సంప్రదించాలని సూచించారు.

నేడు రెవెన్యూ సదస్సు

ఆత్మకూరురూరల్: మండలంలో భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈ నెల 19, 23 తేదీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీ సుధీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు నువ్వూరుపాడు సచివాలయం, 23న ఉదయం 10 గంటలకు దేపూరులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని చెప్పారు. రీ సర్వేకు సంబంధించి అడంగల్‌లో మార్పులు, చేర్పులు, ఫిర్యాదులపై అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు గ్రామపటం, ఆర్ఎస్సార్, మాన్యువల్ అడంగల్, ఎఫ్ఎంబీ, వెబ్‌ల్యాండ్ రీసర్వే ఫైనల్ ఆర్ఓఆర్ సెక్షన్ 22ఏ ప్రకారం తయారుచేసిన జాబితాలతో గ్రామసభలకు హాజరుకావాలని కోరారు.

కావలి డివిజన్‌లో 10.6 మి.మీ. వర్షపాతం

కావలి: కావలి డివిజన్ పరిధిలో శుక్రవారం ఉదయానికి 10.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు కావలి ఆర్డీఓ ఎం వంశీకృష్ణ తెలిపారు. కావలిలో 2.2, దగదర్తి 1.2, అల్లూరు 1.8, విడవలూరు 3.4, కొడవలూరు 2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైందని వివరించారు.

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(సుబ్బయ్య బడి)లో ఓపెన్ స్కూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు చెంచయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్‌ను ఓపెన్ స్కూల్ ద్వారా చదవాలనుకునే వారు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.3వేలు, పరీక్ష ఫీజు రూ.700 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఏదోక తరగతి చదివిన టీసీ, ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రెండు ఫొటోలు, బ్యాంకు పాసుబక్‌తో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.